# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



## 18 వ భాగం

### *హిరణ్యకశిపుడు – 3*

హిరణ్యకశిపుడికి బ్రహ్మ కనిపించి చెప్పేడు కదా ఏది కావలిస్తే అది ఇస్తానని? ఇప్పుడు ముందు తమ్ముణ్ణి చంపిన విష్ణువు మీద పగ చల్లార్చుకోవడానికి వేసుకున్న ఉపాయాలు, యుక్తులూ, పన్నాగం, పథకాలూ అంతా పెట్టి అడుగుతున్నాడు మనసులో కోర్కె.

**శా.** **గాలిం, గుంభిని, నగ్ని, నంబువుల, నాకాశస్థలిన్, దిక్కులన్,**
**రేలన్, ఘస్రములం, దమఃప్రభల, భూరిగ్రాహ, రక్షో, మృగ,**
**వ్యాళాదిత్య, నరాది జంతు కలహవ్యాప్తిన్, సమ,స్త్రాస్త్ర శ**
**స్త్రాళిన్, మృత్యువులేని జీవనము లోకాధీశ! యిప్పింపవే.** [౭-౯౦]

"గాలిలో, నేలమీద, ఆకాశంలో, భూమ్మీద, ఏ దిక్కులో అయినా సరే మృత్యువు సంభవించకూడదు. పాములు, మృగాలు, దేవతలు, మనుషుల వల్లా, ఏ విధమైన ప్రాణం ఉన్నదానితో అయినా, లేనిదానితో అయినా సరే యుద్ధం చేయవలసి వస్తే నాకు చావు రాకూడదు. ఏ విధమైన శస్త్ర అస్త్రాల వల్లా నాకు మరణం రాకూడదు. పగలు గానీ రాత్రిగానీ మృత్యువు ఉండకూడదు. నీకు కనక నా తపస్సు నచ్చినట్టైతే ఈ కోరిక తీర్చు." ఈ పద్యం శైలి ఒకసారి గుర్తుపెట్టుకుందాం. ఎందుకంటే మళ్ళీ ప్రహ్లాదుడు ఇదే శైలిలో తండ్రితో మాట్లాడతాడు ఉత్తరోత్తరా. హిరణ్యకశిపుడు ఏ చావు వద్దనుకున్నాడో అదే తాను కోరుకున్నాడని మనకి చివర్లో తెలుస్తుంది.

వ. అని మఱియు రణంబులందుఁ దన కెదురులేని శౌర్యంబును, లోకపాలుర నతిక్రమించు మహిమయును, భువనత్రయజయంబును, హిరణ్యకశిపుండు గోరిన నతని తపంబునకు సంతోషించి దుర్లభంబయిన వరంబు లన్నియు నిచ్చి కరుణించి విరించి యిట్లనియె.

[7–91]

యుద్ధంలో ఎదురులేని శౌర్యం, లోకపాలకులని నెగ్గేటువంటి పరాక్రమం అన్నీ ఇవ్వండి అన్నాడు. ఓ విషయం గమనించారా? విష్ణువుని నేను చంపెయ్యాలి అలా కోరిక తీర్చు అని అడగలేదు ఎందుకంటే ముందే చెప్పేడు – విష్ణువెలా ఉంటాడో తెలియదు. ఓ సారి మృగంలా వచ్చి తమ్ముణ్ణి చంపేడు. ఇంకోసారి దేవతలాగా వచ్చి చంపవచ్చు. అందుకే ఇలా అందర్నీ కలిపేస్తే ఏ రూపంలో/అవతారంలో వచ్చినా చంపేయవచ్చు అని అనుకున్నాడు. ఇప్పటికి బ్రహ్మకి తెల్సింది. తథాస్తు అనక తప్పదు. కానీ ఇతడి కోరిక చూస్తే గొంతెమ్మ కోరిక. ఇది అనుగ్రహిస్తే ఇతడేం చేస్తాడో తెలియదు. అందుకని అన్నీ ఇచ్చాక ఈ కోరిక మూలాన ఎటు తిరిగి ఎటు వస్తుందో, జాగ్రత్తగా ఉండు నాయనా అని చెప్పడానికి అంటున్నాడిప్పుడు.

శా. అన్నా! కశ్యపపుత్రా! దుర్లభము లీ యర్థంబు లెవ్వారికిన్;
ము న్నెవ్వారలుఁ గోర రీ వరములన్; మోదించితిన్ నీ యెడన్
నన్నుం గోరిన వెల్ల నిచ్చితిఁ బ్రవీణత్వంబుతో బుద్ధి సం
పన్నత్వంబున నుండు మీ సుమతివై భద్రైకశీలుండవై. [ ౭-౯౨]

“ఒరే నాయనా ఇలాంటి వరాలు ఇప్పటిదాకా ఎవరూ అడగలేదూ, నేను ఇవ్వలేదు. నీ తపస్సు చూసి నీకు మాత్రం ఇచ్చేను. కాస్త మంచివాడిలా ఉండి బుద్ధిమంతుడవై ఉండు సుమా” అని హెచ్చరిస్తున్నాడు. అతడిక్కావాల్సింది వరాలు, బ్రహ్మ ఇచ్చే ఉచిత సలహా కాదు. వరాలు ఇచ్చి వెను తిరిగాడు అంబోజాసనుడు. అంతే ఒక్కసారి జూలు విదిల్చి హిరణ్యకశిపుడిలోంచి అసలు రాక్షసుడు బయటకొచ్చేడు. దాదాపు ఎవరితోనూ చావకూడదు కదా? ఇప్పుడు దండయాత్ర సాగించేడు.

మ. దితిపుత్రుండు జగత్త్రయైకవిభుఁడై దేవేంద్రసింహాస నో
ద్ధతుఁడై యుండ హరాచ్యుతాంబుజభవుల్ దప్పించి భీతిన్ సమా
గతులై తక్కిన యక్ష కిన్నర మరుద్గంధర్వ సిద్ధాదు లా
నతులై కానుక లిచ్చి కొల్తు రతనిన్ నానా ప్రకారంబులన్. [౭-౯౯]

దేవేంద్ర సింహాసనం ఎక్కేడు. హరాచ్యుతాంబుజభవుల్ తప్పించి – అంటే త్రిమూర్తులని తప్ప మిగతా అందర్నీ లోబరుచుకున్నాడు. మరి త్రిమూర్తులని ఎందుకు తప్పించేడు? దీనికి సమాధానం సులభంగా చెప్పవచ్చు. హరి ఎలా ఉంటాడో తెలియదు. తమ్ముణ్ణి యజ్ఞ వరాహరూపంలో చంపేడు. మనిషా? జంతువా? మరి బ్రహ్మో? తనకి వరాలు ఇచ్చాడు అంటే గురువుకింద లెక్క. మరి శంకరుడో? ఆయక మూడో కన్ను తెరవ్వొచ్చు. ఆ మూడో కన్ను వరంలో అడగలేదు కదా?

అదీగాక రాక్షసులందరికీ శివుడే ముందు నుంచీ దేముడు కదా? వీళ్ళని వదిలేసి గంధర్వ,యక్ష కిన్నర కింపురుష, దేవ దానవులందర్నీ లోబరుచుకున్నాడు. ఇప్పుడు చూస్తే ఇతడు అమరుడిలా కనబడుతున్నాడు. ఇతడి కోరిక తీర్చమని బ్రహ్మదేముడి దగ్గిరకి ఎందుకెళ్ళామురా భగవంతుడా అని దేవతలు ఏడుస్తున్నారు. బ్రహ్మగారికేమో ఇంకో రకమైన తలనెప్పి. కోరికలు తీర్చకపోతే ఇతడి తపశ్శక్తికి లోకాలు దగ్ధమైపోయేలాగ ఉన్నాయి. దేవతలే ముందు వచ్చి అతడి కోరిక తీర్చమన్నారు కదా? కోరిక తీరిస్తే ఇప్పుడు ఇది.

శా. ఏ దిక్పాలకురఁ జూచి నేఁ డలుగునో యే దేవు బంధించునో
యే దిగ్భాగముమీఁద దాడి చనునో యే ప్రాణులం జంపునో
యీ దైత్యేశ్వరుఁ డంచు నొండొరులు దా రింద్రాదు లాస్తాన భూ
వేదిన్ మెల్లన నిక్కి చూతురు భయావిర్భూత రోమాంచు లై. [౭-100]

ఇంకా ఊరుకోలేదు. ఇతడి ఆగడాలు చూసే సరికి ఏ రోజు ఎవరి మీదకి దండెత్తుతాడో తెలియదు. ఏ దిక్పాలురమీద ఇతనికి కోపం వస్తుందో తెలియదు. వీళ్ళందరూ వణికిపోతున్నారు ఎప్పుడు ఎవర్ని చంపుతాడో అని. అతడు చెప్పినప్పుడే పాములు తల పైకి ఎత్తాలిట. తాపసులందరూ వీడు చెప్పినట్టు దీవించాలి. ఎలా పాడమంటే అలా పాడాలి గంధర్వులందరూ. అంటే ఏమిటన్నమాటా వాళ్ళందరికీ స్వతంత్రం అనేది లేకుండా పోయింది. కటకటాల్లో పెట్టి కడుపునిండా భోజనం పెడతాం అంటే ఎవరు మాత్రం ఒప్పుకుంటారు?

**శా. లీలోద్యాన లతా నివాసములలో లీలావతీయుక్తుఁడై**

**హాలాపానవివర్ధమాన మదలోలావృత్త తామ్రాక్షుఁడై**

**కేళిం దేలఁగ నేనుఁ దుంబురుఁడు సంగీతప్రసంగంబులన్**

**వాలాయంబుఁ గరంగఁ జేయుదుము దేవద్వేషి నుర్వీశ్వరా!** [౭-౧౦౨]

ఇది చాలదు కాబోలు మనవాడికి. ఇప్పుడు నారద తుంబురల్నీ ఇద్దర్నీ రప్పించి అతడు లీలావతి తో అలా విహారం చేస్తూ ఉంటే అతడు చెప్పినట్టూ అతడికుల్లాసం కల్గించే సంగీతం పాడాలి. మాంచి రసికుడు కదా? మొదట్లోనే చెప్పుకున్నాం ఈ హిరణ్యకశిపుడి కధ నారదుడు ధర్మరాజుకి చెప్తున్నట్టూ. అందుకే ఇందులో "నేను" అంటున్నాడన్నమాట. అంటే ఇంతమంది పీడితుల్లో నారదుడు కి కూడా ఏమి మినహాయింపు లేదు. "అరె అరె హిరణ్యకశిపుడినిరా నిన్నూ నంచుకు తింటాను రా" అనే పాట మీరు విన్నారా ఎప్పుడైనా? ఇదే దేవ దానవులని నంచుకు తినడం అంటే.

**క. సోదరుఁ జంపిన పగ కై**

**యాదర మించుకయు లేక యసురేంద్రుఁడు కం**

**జోదరుపై వైరము దు**

**ర్మాదరతుం డగుచుఁ జేసె మనుజాధీశ!** [౭-౯౪]

ఇదంతా ఎందుకు? అసలు కధానాయకుణ్ణి పట్టుకోవాలి. దానికోసమే అసలు ఈ ప్రణాళికంతాను. ఈ హిరణ్యకశిపుడు సామాన్యుడా? వైకుంఠం దాకా వెళ్ళాడు శ్రీహరిని పట్టుకోవడానికి. కానీ ఆయనకబడ్డే? పెద్ద శతృవు కనబడట్లేదనుకోండి, ఏం చేస్తాం? అతడి భృత్యుల్నందర్నీ నానా హింసలూ పెడితే అసలాయన వచ్చి లొంగిపోతాడనే కదా? తమ్ముణ్ణి చంపిన శ్రీహరిని పట్టుకోవాలంటే ఆయన చిక్కడు, దొరకడు. ఆయనకి ఆప్తులైన యోగుల్నీ, యజ్ఞాల్నీ, వేదాల్నీ, దేవతల్నీ పట్టుకుంటే ఆయనే కాళ్ళబేరానికి వస్తాడని ఆశ. ఈ పద్యంలో విష్ణువుని కంజోదరుడు అంటున్నాడు పోతన. కంజము అంటే పద్మం. అది ఉదరంలో ఉన్నవాడు. పద్యాల్లో ఇలాంటి పదప్రయోగాలు చేయడంలో పోతనది అందేవేసిన చేయి.

ఇతడు పెట్టే బాధలు భరించలేక దేవతలందరూ శ్రీహరి మీద మనసు నిలిపి ధ్యానించేరు. భగవంతుడంటే అన్నీ తెల్సినవాడు కదా? కానీ కర్మ పరిపాకం అవకుండా ఆయన కూడా ఏమీ చేయలేడు. అందుకే ఇప్పుడు చెప్తున్నాడు ఆయన.

**మ. భయముం జెందకుఁ డయ్య! నిర్జరవరుల్! భద్రంబు మీ కయ్యెడున్**

**జయమున్ లాభము భూతసంతతికి మత్సందర్శనప్రాప్తి న**

**వ్యయమై చేరు; నెఱుంగుదున్ దితిసుత వ్యాపారభాషా విప**

**ర్యయముల్; కాలము గూడఁ జంపెదఁ జనుం డందాఁక మీ త్రోవలన్.** [౭-౧౧౦]

"నేను చూస్తున్నాను ఇతడు చేసేవన్నీ. భయం విడవండి. ఇతడు చేసే దుష్కృత్యాలన్నీ చూస్తూనే ఉన్నాను. సరైన కాలం చూసి చంపుతాను ఇతడిని." బ్రహ్మ వీడికిచ్చిన కోరికల ప్రకారం చంపాలి అంటే వీడికన్నా మాంఛి విశ్లేషణాత్మకమైన తెలివితేటలు ఉండాలి. కానీ

చంపబోయేది తన స్వంత ద్వారపాలకుడ్ని. ఏదో ఆషామాషీగా చంపేస్తే అతడిలో రాక్షసత్వం పోదు. దీనితో పాటు ఇతడు అందర్నీ పెట్టే బాధలకి సరిపడా శిక్ష పడాలి. అన్నింటికన్నా ముఖ్యం ఇతడు చావడానికి ముందు అనుక్షణం తననే తల్చుకుంటూ ఉండాలి. ఇవన్నీ ఆలోచించేడు మహావిష్ణువు.

మీరు గమనించే ఉంటారు. బాగా దక్షులైన నిర్వాహకులుంటారు వాళ్ళు చేసేవన్నీ పైకి చెప్పరు. కాని ఒక ప్రణాలిక మొదలు పెడితే దాని ఫలితాలు రావడానికి కొంత సమయం పడుతుంది. అవి అందరికీ ముందు చెప్పక్కర్లేదు. అన్నీ అయ్యేక అందరూ "ఓహో, ఏం ప్రణాలిక! ఎంత మంచి దక్షత" అనుకోవడం మనకి తెలుస్తుంది. అందుకే ఇక్కడ విష్ణువు అన్నీ విడమర్చి చెప్పలేదు దేవతలకి. మీరు వెళ్ళండి; నేను చూస్తాను ఇతడి సంగతి అంటున్నాడంతే.

వచ్చే వ్యాసంనుంచీ, శ్రీహరి ప్రహ్లాదుడి రూపంలో హిరణ్యకశిపుడికి తెలియకుండా అతడింట్లోనే నిప్పు పెట్టి అతణ్ణి నాశనం చేయడం ప్రహ్లాదోపాఖ్యానంలో చదువుకుందాం.

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS